క్లుప్తంగా

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



ఓఎంఆర్ షీట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : మండలంలోని మిట్టపల్లె, పెద్దపల్లె, శంభునిపల్లె, బొగ్గిడివారిపల్లె, పాలకొండ్రాయునిపల్లె గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ శంకరయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిట్టపల్లెలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, భోజనం రుచికరంగా ఉందని పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని మెచ్చుకున్నారు. పెద్దపల్లె, శంభునిపల్లె పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను చదివించడం, రాయించడం వంటివి పర్యవేక్షించినట్లు చెప్పారు. బొగ్గిడివారిపల్లె, పాలకొండ్రాయునిపల్లె పాఠశాలలను తనిఖీ చేసి రికార్డుల పరిశీలించి అభినందించారు. అనంతరం పాఠశాలల్లో ఓఎంఆర్ షీట్‌లను పరిశీలించారు.

కెనరా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

సుండుపల్లె (వీరబల్లి) : కెనరా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని రీజనల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. సుండుపల్లెలోని పింఛాకు వెళ్లే దారిలోని కెనరాబ్యాంకు నూతన శాఖను రీజనల్ మేనేజర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుండుపల్లె బ్రాంచ్‌లో 18 వేల ఖాతాలున్నాయని, ఇందులో రూ. 100 కోట్ల వరకు లావాదేవీలు సాగుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్‌లను విడుదల చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : ఫిబ్రవరి 15న కలకత్తా నగరంలో జరగనున్న తమ సంఘం 10వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయరామయ్య, పందికాళ్ళ మణిలు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం అలీమాబాద్‌వీధిలో వారు జాతీయ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 15 నుంచి 18వతేదీ వరకు మహాసభలు జరగనున్నాయన్నారు. మహాసభల్లో పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభలకు వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు.

అన్ని రకాల రుణాలను అందిస్తున్నాం

లక్కిరెడ్డిపల్లి : సహకార సంఘం బ్యాంకు ద్వారా రైతులు, ఇతరులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం జిల్లా నోడల్ ఆఫీసర్ షకీలా పేర్కొన్నారు. సహకార సంఘం 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం లక్కిరెడ్డిపల్లె సహకార సంఘం బ్యాంకు వారు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ షకీలా మాట్లాడుతూ అన్ని బ్యాంకులతో సమానంగా సహకార సంఘం బ్యాంకులో రైతులకు, ఇతరులకు అన్ని రకాల రుణాలు అందిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అశోక్ కుమార్, బ్యాంక్ సిబ్బంది సురేష్, ఏపీఎం నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్

రాయచోటి : అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గిరీషా పీఎస్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో గత రెండు రోజులుగా వివిధ మండలాలలోని చౌక దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంఎల్‌ఎస్ పాయింట్స్, వసతి గృహాలను సందర్శించి అక్కడి గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులకు సూచించానని ఆయన జిల్లా కలెక్టర్‌కు తెలిపారు.

జూదరుల అరెస్టు

కలికిరి : జూదరులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఏఎస్ఐ మాబు సాహెబ్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుట్టపాళెం కస్పా నందు జూదమాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం సీఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.21200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రజాదరణను ఓర్వలేకే ప్రతిపక్షం విమర్శలు

- సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను ఆశీర్వదించండి
- నందలూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి శ్రీకారం
- పాల్గొన్న ఎమ్మెల్యే మేడా, పరిశీలకుడు కృష్ణమూర్తి, ఎంపీపీ విజయ్‌భాస్కర్‌రెడ్డి



పాల్గొన్న గృహసారథులు, వలంటీర్లు



కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, పరిశీలకుడు కృష్ణమూర్తి

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, దానిని ఎల్లో మీడియా విషం చిమ్ముతోందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలో తొలి విడతగా నందలూరులో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కృష్ణమూర్తితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన వైపే చూస్తున్నాయన్నారు. గ్రామ వలంటీర్లు ఎక్కడా భయపడవలసిన అవసరం లేదన్నారు. వలంటీర్లకు తోడుగా గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు ఉంటారన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. పేదలకు ప్రజాసంకల్పయాత్రలో చెప్పినట్లుగా సంక్షేమ పథకాలు వారి ముంగిటకు తీసుకువచ్చారన్నారు. ముఖ్యమంత్రి చేపట్టిన మంచి కార్యక్రమాలను కొన్ని ప్రతిపక్షాలనేతలు, దత్తపుత్రులు, ఎల్లోమీడియా దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని పకడ్బందీగా అమలు చేసే బాధ్యత వలంటీర్లతోపాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉంటుందన్నారు. నియోజకవర్గం పరిశీలకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి సీఎం చేస్తున్న కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి తెలియజేయాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తీసుకొచ్చిన సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టే విధంగా తమ బాధ్యతలను నిర్వహించాలన్నారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని సచివాలయాల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుసుకొని వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధులన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి కరీముల్లా ఖాన్, జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీర్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు బి.లక్ష్మీనరసయ్య, నడివీధి సుధాకర్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, సింగల్ విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు మోదుగల చంద్రశేఖర్, మైనుద్దీన్, లేబాక నరసయ్య, నాయనపల్లె అనుదీప్, భువనబోయిన శ్రీదేవి పెంచలయ్య ముదిరాజ్, ఏజీపీ షమీ, సీనియర్ నాయకుడు మున్వర్ బాషా, మార్కెట్ కమిటీ డైరక్టరు మాధవి, బీసీనేత హిమగిరియాదవ్, దళిత నేత ఆర్ముగం విశ్వనాథ్, మాజీ ఎంపీటీసీ పసుపులేటి సుబ్రమణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను నాయకులు ఘనంగా సన్మానించారు.

సబ్‌కలెక్టర్‌తో ఎమ్మెల్యే భేటి

రాజంపేట సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్‌తో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి బుధవారం ఆయన చాంబరులో భేటి అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సబ్‌కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ఎమ్మెల్యే వెంట ఈడిగ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు దాసరి చిదానందగౌడ్, కబడ్డీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, రాజంపేట ఏరియా ఆసుపత్రి డైరక్టరు ఉమామహేశ్వరరెడ్డి, కొండూరు విశ్వనాథరాజు, మందరం గంగిరెడ్డిలు ఉన్నారు. అంతకముందుగా సబ్‌కలెక్టర్‌ను ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

రాజంపేట టౌన్ : ఉపాధి హామీ పథకంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని బోయినపల్లెలో ఉన్న వెలుగు కార్యాలయంలో బుధవారం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని తొమ్మిది మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామస్తులతో చర్చించి పనులను చేపట్టాలన్నారు. పొలాలకు వెళ్ళే రోడ్లు, స్మశానం అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ పి.చినతాతయ్య మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద గ్రామస్థాయి ప్రణాళిక విధిగా ఉండాలన్నారు. ఎంత మంది వేతనదారులు ఉన్నారు, ఎంత మంది పనికి వస్తున్నారు. పనికిరాని వారు ఎంత మంది, పనికి రాకుంటే అందుకుగల కారణాలను తెలుసుకోవాలన్నారు. పీడీ ఎంసీ మద్దిలేటి మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించిన పనులకు తొంభై పనిదినాలను కల్పించాలని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం ఏపీడీలు, ఏపీఓలు పాల్గొన్నారు.

తిరుమల, హరిప్రియ రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేత

నందలూరు(రాజంపేట) : జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో తిరుమల(విశాఖ–కడప), హరిప్రియ(తిరుపతి–కోల్హాపూర్) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఉన్న హాల్టింగ్ బుధవారం నుంచి ఎత్తివేశారు. ఈ మేరకు డివిజన్ స్థాయి ఉన్నతాధికారుల నుంచి ఇక్కడి ఆదేశాలు జారీ అయ్యాయి. ముందుగా ఈ రెండు రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్ ఇచ్చారు. ఎర్నింగ్స్‌ను బట్టి తర్వాత కొనసాగించాలా, ఎత్తివేయాలన్నదే రైల్వే యోచన. ఆరునెలల వరకు హాల్టింగ్ ఇచ్చి, ఆ తర్వాత ఎత్తివేయడంపై సర్వత్రా విమర్శలను ఎదుర్కొంటోంది.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 11వ తేదీన లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరగనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి శారద తెలియజేశారు. కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న ఇరు వర్గాల వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.రూ. 1,42,345 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్, ఈవో రవీంద్రరాజు, ఆలయ చైర్మన్ మాధవరం భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో 180 రోజులు సంబంధించి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

పారదర్శకతతో ప్రజల్లో సంతృప్తి

ఎస్.సోమవరం గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : విప్లవాత్మక మార్పులతో ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగమోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎస్.సోమవరం గ్రామంలోని అగ్రహారం, హరిజనవాడ, దేవళంపేటలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లుగా జగన్ పాలన సాగుతోందన్నారు. ఎమ్మెల్యేకు ప్రతి ఇంటా ఘనస్వాగతం లభించింది. సంక్షేమ పథకాల కేటాయింపు పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారు.

ప్రజలతో మమేకం.. సమస్యల పరిష్కారం

కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఎమ్మెల్యే ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకొంటూ వాటి పరిష్కారానికి అడుగులు వేశారు. అగ్రహారంలో స్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరగా స్పందించిన శ్రీకాంత్‌రెడ్డి తహసీల్దార్‌కు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కాగృహాల మంజూరునకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, రాష్ట్రకార్యదర్శి చిదంబరరెడ్డి, సర్పంచ్ అనుసూయమ్మ, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాలొగన్నారు.

విద్యార్థులకు థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలు



థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండల కేంద్రంలోని బేల్దారి వీధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిజాడర్ కంట్రోలింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 6 నుంచి 12 సంవత్సరాల వయస్సున్న విద్యార్థులకు అయోడిన్ లోపం ఉందా లేదా అనేది సర్వే చేశామన్నారు. ఈ అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో శారీరక, మానసిక పెరుగుదలను అంచనా వేయుటకు మరో సారి సర్వే నిర్వహించారన్నారు. ఈ సర్వేలలో భాగంగా ఇక్కడి పాఠశాలలోని 27 మంది విద్యార్థులను శారీరకంగా పరీక్షించడంతోపాటు, యూరిన్ పరీక్షలు కూడా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శంషాద్‌బేగం, సబ్ యూనిట్ అఫీసర్ ఐ. సుబ్బరాయుడు, ఎంపీహెచ్ఓ వర్ధన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రామ్మోహన్, పద్మావతి, ఏఎన్ఎంలు లక్ష్మీదేవి, లోకేశ్వరి, ఆశ వర్కర్‌లు భారతి, కళావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'ని సద్వినియోగం చేసుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఉపాధి హామీ డైరెక్టర్ చిన్నతాతయ్య

ఓబులవారిపల్లె : ఉపాధి హామీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధిహామీ పథకం డైరెక్టర్ చిన్నతాతయ్య తెలియజేశారు. బుధవారం మండల పరిధిలోని ముక్కవారిపల్లి పంచాయతీలో ఉపాధిహామీ పథకం ద్వారా పెంపకంలో ఉన్న మామిడి చెట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు మామిడి మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని మామిడి చెట్లను నాటుకొని వాటిని సంరక్షించుకొని లబ్ధిపొందాలని సూచించారు. మూడు సంవత్సరాలపాటు మామిడి మొక్కల సంరక్షణకు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా నగదును చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, ఎంపీడీఓ విజయారావు, ఏపీఓ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించండి



రోగులకు భోజనం ప్లేట్లను అందజేస్తున్న హిమదేవి

సిద్దవటం : ఆసుత్రులలో రోగులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిణి డాక్టర్ హిమదేవి తెలిపారు. మండలం కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అడ్మిట్ అయిన పేషంట్లకు బుధవారం భోజనం ఏర్పాటు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పేషంట్లకు భోజనం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం హిమదేవి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో నూతన ఆసుపత్రి భవనం పూర్తవుతుందని అందులో ఆపరేషన్ థియేటర్‌తో పాటు ప్రభుత్వం అన్నీ రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే రోగులు ఆసుపత్రి వైద్యులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మధుశేఖర్, డాక్టర్ శశికుమార్, డాక్టర్ లీలాకిరణ్మయి, డాక్టర్ సాయివరుణ్ ప్రసాద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాలస్వామి, వెంకటసుబ్బారెడ్డి, నిర్వాహకురాలు క్రిష్ణవేణి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, కార్యకర్తలు, పుల్లయ్య, సుబ్రమణ్యం, ఆసుపత్రి సిబ్బంది, తదిరతులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్‌ను వీఆర్‌ఏలకు రద్దు చేయాలి

రాయచోటి అర్బన్ : వీఆర్‌ఏలకు అమలులో ఉన్న ముఖ ఆధారిత హాజరు పద్ధతిని వెంటనే రద్దుచేయాలని కోరుతూ ఈనెల 14వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీ.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ ఆధారిత హాజరు విధానంలో వీఆర్‌ఏలు తమ సెల్‌ఫోన్‌లలో తామే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫోటో తీసి యాప్ ద్వారా హాజరు పంపాల్సి ఉందన్నారు. వీఆర్‌ఏలలో అత్యధికులు చదువురానివారు, సెల్‌ఫోన్ కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేనివారు ఉన్నట్లు తెలిపారు. దీంతో వీఆర్‌ఏలకు ముఖఆధారిత హాజరు నమోదు చాలా కష్టంతో కూడుకున్న పని అన్నారు. వీఆర్‌ఏలు ఫేస్‌యాప్‌లో సకాలంలో ఫోటోలు తీసిపంపకపోతే విధులకు గైర్హజరుగా నమోదవుతుందన్నారు. ఇలా వరుసగా 5,6 రోజులు హాజరు పంపలేకపోతే ఉద్యోగం ఊడిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీఆర్‌ఏలకు ఫేస్ యాప్ అటెండెన్స్ పద్ధతిని రద్దుచేయాలన్న డిమాండ్‌తో ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వీఆర్‌ఏలంతా ఆందోళనకు హాజరై విజయవంతం చేయాలంటూ వారు విజ్ఞప్తి చేశారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన అవసరం



సిలిండర్ ద్వారా వచ్చే మంటలను ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : అగ్నిప్రమాదాలపై విద్యార్థులు అవగాహన అవసరమని రాయచోటి ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం రాయచోటి నారాయణ పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలు – వాటి నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి. వాటిని ముందస్తుగా ఎలా నివారించవచ్చునని విషయాలపై వివరించారు. విద్యార్థులతో కలిసి సిలిండర్ ద్వారా మంటలు ఎలా సంభవిస్తాయి వాటిని ఎలా ఆర్పాలనే దానిపై ప్రాక్టికల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చెన్నకేశవరాజు, ప్రిన్సిపల్ ఖాదర్ వలీ, ఆర్ఐ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతరలో భక్తులకు వసతులు కల్పించండి



ప్రాంగణంలో జరుగుతున్న పనులపై ఆరాతీస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 21, 22వ తేదీలలో జరిగే అనంతపురం గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అటు అధికారులు ఇటు ఆలయ సిబ్బంది త్వరితగతిన ఏర్పాట్లను పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివశంకర్ రెడ్డిలతో కలిసి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి బుధవారం అనంతపురం గంగమ్మ దేవతను దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర ప్రాంగణంలో జరుగుతున్న పనులపై ఆరాతీశారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ బాల సుబ్రమణ్యం, పూజారులు సుబ్బయ్య, రెడ్డి శేఖర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సంక్షేమ ఫలాలు అందించాలన్నదే సీఎం లక్ష్యం
- గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శెట్టిగుంట–2 సచివాలయం పరిధిలోని యానాదిపల్లి, అరుంధతివాడ గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఆయా కుటుంబాలకు సీఎం జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా గత మూడున్నరేళ్ళలో చేకూరిన ప్రయోజనాలను బుక్‌లెట్లతో వివరించారు. అర్హత ఉన్న వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, పథకాల మంజూరులో పూర్తిస్థాయిలో పారదర్శకత పాటిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పేదలకు ఆర్థిక భరోసాను అందించడమే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్ సంక్షేమ పాలనను అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాలని, లేకుంటే అందుకు గల కారణాలను, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వారికి మేలు చేకూర్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. గతంలో ఏదైనా ఒక పథకంలో లబ్ధి పొందాలంటే కాళ్ళరిగేలా కార్యాలయాలు, నాయకులు చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శవంతమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, వెంకటరెడ్డి, సిద్దయ్య, మల్లు రెడ్డయ్యరెడ్డి, నారాయణరెడ్డి, బత్యాల నందగోపాల్, పత్తి నరసింహులు, మనోహర్, మహేష్, తోట శివసాయి, శివాజి, నాగేంద్రరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని గాదెల వెంకటాపురం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వాన్ని గురువారం (నేడు) నిర్వహించనున్నట్లు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరుకానున్నారన్నారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

విద్యతోపాటు స్కిల్స్ ముఖ్యం

ప్రభుత్వవిప్ కొరముట్ల, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి



టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కొండూరు అజయ్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : డిజిటల్ దశ తీసుకువస్తున్న పెనుమార్పులకు తగ్గట్టు అత్యాధునిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడమే ఉద్యోగార్థుల కర్తవ్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన స్కిల్ హబ్, టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌లను కొండూరు అజయ్‌రెడ్డితో కలిసి కొరముట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే విద్యతోపాటు జీవన నైపుణ్యాలు (స్కిల్స్) చాలా ముఖ్యం అన్నారు. అనంతరం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి మాట్లాడుతూ యువత ఉపాధి లభించక నిరుద్యోగులుగా ఉండకూడదనే లక్ష్యంతో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థి దశనుంచే వివిధ రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ అందించి వారి ఉన్నతికి రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్స్ నేర్పించే దిశగా శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ శ్రీలత, శివయ్య, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న మర్రి సుమిత్ర

రాయచోటి అర్బన్ : మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు వెంటనే పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు మర్రి సుమిత్ర డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ మహిళా సమాఖ్య ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ళ శ్రీనివాసులు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నిరకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ మహిళలపై దాడులు, హింస, అత్యాచారాలు, అన్యాయాలు, లైంగికవేధింపులు, వివక్ష కొనసాగుతూనే ఉన్నాయన్నారు.

పట్టణ నూతన కమిటీ ఎంపిక

రాయచోటి పట్టణ మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షురాలిగా సంపూర్ణ, కార్యదర్శిగా సునీత, ఉపాధ్యక్షురాళ్లగా అరుణ, సుబ్బమ్మ, సహాయ కార్యదర్శులుగా మల్లీశ్వరి, నవీబా, కోశాధికారిగా పద్మావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యలకు నిలయాలుగా పాఠశాలలు

రాయచోటి అర్బన్ : సమస్యలకు నిలయాలుగా కస్తూరిబా, గురుకుల పాఠశాలలు మారాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో సరైన పౌష్టికాహారం అందక, పరిశుభ్రత లోపించడం కారణంగా విద్యార్థులు విషజ్వరాల బారినపడుతున్నారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో కిందిస్థాయిలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని తెలిపారు.